క్లుప్తంగా

'అర్హులందరూ పింఛన్ పొందవచ్చు'



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న న్యాయవాది ప్రసాదరావు

మాడుగుల: అర్హులందరూ సామాజిక పింఛన్ ను పొందవచ్చని సీనియర్ న్యాయవాది శ్రీనాదు ప్రసాదరావు తెలిపారు. పలువురు వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు ప్రభుత్వం అందిస్తున్న పింఛనే ఆధారంగా జీవిస్తున్నారని చెప్పారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అర్హత ఉండి కూడా పింఛను దక్కని వారికి దరఖాస్తు చేసుకునే విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులుతో పాటు పింఛను అందనివారు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



ఎ.కోడూరు హైస్కూల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న మహాలక్ష్మి

కె.కోటపాడు : చదువుల్లో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని భీమిలి డైట్ కళాశాల అధ్యాపకురాలు మహాలక్ష్మి అన్నారు. మండలంలో కె.సంతపాలెం ప్రాథమిక పాఠశాల, ఎ.కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను బుధవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలించారు. విద్యార్థులకు హెచ్‌బీ పరీక్షలను నిర్వహించాలని,రక్తహీనత గల వారికి ఐరెన్ మాత్రలను అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో డి.వి.డి. ప్రసాద్, హెచ్‌ఎం కామేశ్వరరావు పాల్గొన్నారు.

సీఐటీయూ పూర్వ అధ్యక్షుడికి ఘన నివాళి



సూర్యనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

నర్సీపట్నం: స్థానిక సీఐటీయూ కార్యాలయంలో బుధవారం సీఐటీయూ పూర్వ జిల్లా అధ్యక్షుడు ఎం.సూర్యనారాయణ 10వ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, కన్వీనర్ ఈశ్వరరావు, ముఠా కార్మిక సంఘనాయకులు నానాజీ, అప్పారావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ సూర్యనారాయణ పేదలు, కార్మికుల పక్షాన పలు పోరాటాలు చేశారని చెప్పారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కె.కోటపాడు : ఎ.కోడూరు ఫీడర్ పరిధిలో గల గ్రామాల్లో ఈ నెల 9వ తేదీ శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏపీ ఈపీడీసీఎల్ ఏఈ చంద్రశేఖర్‌రావు తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతు పనులతో పాటు విద్యుత్ లైన్లను తాకుతూ పెరిగిన మొక్కలను తొలగించేందుకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు చెప్పారు. ఫీడర్ పరిధిలో గల గ్రామాలైన ఎ.కోడూరు, పాడుగుపాలెం, సూర్రెడ్డిపాలెం, సింగన్నదొరపాలెంలలో విద్యుత్ సరఫరా ఉండదని ఆయన తెలిపారు.

రోలుగుంట: విద్యుత్ లైన్ల మరమ్మతు పనుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ నర్సీపట్నం డివిజన్ ఈఈ వి.డి.వి.రామకృష్ణారావు ఓ ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రం రోలుగుంట, ఓలం ఆగ్రో, సన్‌ఫుడ్ కార్పొరేషన్ జీడిపిక్కల ఫ్యాక్టరీ పరిధిలో ఉదయం 9 గంటలకు నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు.

సంపద తయారీ కేంద్రంతో ఆదాయం

మునగపాక : సంపద తయారీ కేంద్రాల ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందని ఈవోఆర్డీ వెంకటలక్ష్మి అన్నారు. తిమ్మరాజుపేట సంపద తయారీ కేంద్రాన్ని ఆమె బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తడి,పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సంపదతయారీ కేంద్రాల ద్వారా తయారవుతున్న ఎరువులను విక్రయించడం ద్వారా ఆదాయం సమకూరుతుందన్నారు.

సరుగుడు వైపు రైతుల చూపు

- వరి, చెరకుకు ప్రత్యామ్నాయంగా సాగు
- గణనీయంగా పెరిగిన విస్తీర్ణం



సరుగుడు తోట

చోడవరం: సరుగుడు సాగు విస్తీర్ణం ఈ ఏడాది గణనీయంగా పెరిగింది. గతంలో మెట్టప్రాంతాలకే పరిమితమైన ఈ సాగు ఇప్పుడు నదీ పరీవాహక ప్రాంతాల్లోను, పల్లపు ప్రాంతాల్లోనూ అధికంగా జరుగుతోంది. వ్యవసాయ పెట్టుబడులు పెరిగిపోవడంతో ఈ ఏడాది వరి, చెరకు సాగు తగ్గింది. వాటి స్థానంలో తక్కువ ఖర్చుతో సాగయ్యే సరుగుడు వేసేందుకు రైతులు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. దీంతో సరుగుడు నారుకు విపరీతమైన గిరాకీ పెరిగింది. చోడవరం నియోజకవర్గంలో వరి, చెరకు ప్రధాన పంటలు. ఏటా 21,500ఎకరాల్లో వరి, 30 వేల ఎకరాల్లో చెరకు సాగవుతుంది. సరుగుడు సాగు ఆరు వేల ఎకరాల్లో జరిగేది. అయితే ఈ ఏడాది సరుగుడు సాగు ఏకంగా 9వేల ఎకరాలకు పైబడి జరుగుతోందని అంచనా. సకాలంలో వర్షాలు పడకపోవడం, మరో పక్క వరి నారు సమస్య, సబ్సిడీపై అందాల్సిన డీఏపీ ఎరువును ప్రభుత్వం అనుకున్నంతగా అందించలేకపోవడం, వీటికి తోడు దమ్ములు, ఉడుపులకు యంత్రాలు, ట్రాక్టర్లు, కూలీలకు అయ్యే ఖర్చు బాగా పెరిగిపోవడం తదితర కారణాలతో వరిని సాగు చేసేందుకు రైతులు వెనుకంజవేస్తున్నారు. వరి నాట్లు సమయంలోనే ఎకరాకి రూ.10 వేల నుంచి రూ.15 వేలకు ఖర్చవుతుండడంతో పెట్టుబడి పెట్టలేని పరిస్థితిలో అన్నదాతలున్నారు.

చెరకు పంటదీ అదే పరిస్థితి...

చెరకు పంటకు కూడా పెట్టుబడి భారీగా పెరిగింది. మరో పక్క గోవాడ సుగర్ ఫ్యాక్టరీ ఈ ఏడాది ఏ మేరకు క్రషింగ్ చేస్తుందో తెలియడం లేదు. ఆశించిన మేర గిట్టుబాటు ధర కూడా ఇవ్వలేని స్థితిలో ఫ్యాక్టరీ ఉండడంతో చెరకు సాగు సాధారణ విస్తీర్ణంలో 40శాతం మేర తగ్గింది. చెరకు ఎకరా సాగుకు ఏటా సుమారు రూ. 40వేలకు పైబడే ఖర్చవుతుండగా ప్రకృతి వైపరీత్యాలు, తెగుళ్ల బెడద ఎక్కువగా ఉండడంతో రైతులు ఏటా నష్టపోతున్నారు. అంతేకాకుండా ఎకరా చెరకు కనీసం 15నుంచి 20టన్నులు కూడా దిగుబడిరాకపోవడంతో ప్రత్యామ్నాయ పంటలపై మొగ్గుచూపుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఒక సారి నాటితే ఎటువంటి ఖర్చు లేకుండా 4,5 ఏళ్ల తరువాత ఒకే సారి మొత్తంలో డబ్బులు వచ్చే వాణిజ్య పంట అయిన సరుగుడుపై ఈ ఏడాది రైతులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. ఇప్పుడు వర్షాలు కురుస్తుండడంతో జోరుగా సరుగుడు నారు వేసే పనిలో రైతులు నిమగ్నమయ్యారు.

సరుగుడు సాగు చేసేవారి సంఖ్య ఒక్కసారిగా పెరగడంతో నారు కొరత ఏర్పడింది. ఒక్కో మొక్క 80 పైసల నుంచి రూపాయి ఉండగా, ఇప్పుడు డిమాండ్‌ను బట్టి రూ.1.20కి విక్రయిస్తున్నారు. అయినా నారు కోసం దూర ప్రాంతాలకు వెళ్లి మరీ తెచ్చి రైతులు సాగు చేస్తున్నారు. వరి, చెరకు సాగు తగ్గడంపై సర్వత్రా ఆందోళన నెలకొంది.

ఖర్చు స్వల్పం.. రాబడి అధికం



నాటేందుకు సిద్ధంగా ఉంచిన సరుగుడు నారు

ఎకరా పొలంలో వరి సాగు చేసేందుకు సుమారు రూ.18 వేలు ఖర్చు అవుతుంది. బాగా పండితే 30 బస్తాల వరకు దిగుబడి రావచ్చు. అంటే సుమారు రూ.30 వేలు ఆదాయం వస్తుంది. అదే చెరకు సాగుకు ఎకరాకు రూ.40వేలు ఖర్చు కాగా, రూ.60వేలు రాబడి వస్తుంది. తుపాన్లు, వర్షాభావ పరిస్థితులు ఏర్పడితే నష్టం తప్పదు. అదే సరుగుడు మొక్కలు ఒక ఎకరాలో నాటేందుకు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు ఖర్చు అవుతుంది. ఒక సారి నాటిన తరువాత ఐదేళ్ల వరకు మళ్లీ పెట్టుబడి పెట్టనవసరం లేదు. ఐదేళ్ల తరువాత రూ.1.50 లక్షల నుంచి రూ. రెండు లక్షల వరకూ ఆదాయం లభిస్తుండడంతో రైతులు ఈ పంటపై ఆసక్తి చూపుతున్నారు.

చెరకుకు గిట్టుబాటు ధర లేకే ...



సరైన గిట్టుబాటు ధర లేకపోవడం వల్ల చెరకు సాగు పూర్తిగా మానేశాం. తిండి గింజలు కోసం వరి సాగు చేస్తున్నాం. వర్షాలు ఎప్పుడు పడతాయో తెలియడంలేదు. పెట్టుబడులు కూడా చాలా ఎక్కువగా పెరిగిపోయాయి. చెరకు సాగుకు చాలా ఖర్చవుతోంది. పంటకు అయ్యే పెట్టుబడి డబ్బులు కూడా రావడంలేదు. అందుకే నాకున్న రెండున్నర ఎకరాల్లో ఈ ఏడాది ఎకరాలో వరి, ఎకరన్నరలో సరుగుడు వేశాను. చెరకు పూర్తిగా వేయలేదు. ప్రభుత్వం చొరవ తీసుకుని చెరకు పంటకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా చర్యలు తీసుకుంటే వచ్చే ఏడాది నుంచి అయినా రైతులు చెరకు వేసే అవకాశం ఉంది.

– మేడా అప్పలకొండ, రైతు, జెడ్‌పట్నం

పెట్టుబడి తక్కువ



తుపాన్లు వచ్చినా పంట నష్టం పెద్దగా ఉండదు, పెట్టుబడి కూడా తక్కువే అందుకే సరుగుడు వేశాను. చెరకు ఎకరాలోను, వరి ఎకరాలో వేశాను, మిగతా ఎకరాన్నరలో సరుగుడు వేశాను. గతంలో ఎప్పుడూ సరుగుడు వేయలేదు. ఈ సారి పెట్టుబడి పెరిగిపోవడం, గిట్టుబాటు ధర లేకపోవడంతో చెరకుకు బదులు సరుగుడు వేశాను. సరుగుడు ఒక సారి వేస్తే 4,5 ఏళ్లు పెట్టుబడి పెట్టనవసరంలేదు. అంతర్గత పంటలు కూడా వేసుకోవచ్చు. వరి, చెరకు సాగుకు చాలా ఖర్చవుతుంది.

– శానాపతి రమణబాబు, రైతు, జి.భీమవరం

ఉపాధి పనుల్లో అవకతవకలు జరిగితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ఎంపీడీవో రాంబాబు

నాతవరం: ఉపాధి హామీ పథకం పనులు నిబంధన మేరకు జరగాలని, క్షేత్రస్థాయి తనిఖీలో అవకతవకలు జరిగినట్టు తేలితే కఠిన చర్యలు తప్పవని ఎంపీడీవో జాగరపు రాంబాబు హెచ్చరించారు. నాతవరంలో బుధవారం ఉపాధి హామీ పథకం సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి ఉపాధి పనికల్పించాలన్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ కావడంతో పంట పొలాల్లో కాలువలను అభివృద్ధి చేయాలని, పోడు భూముల్లో రాతిపేర్పు పనులు నిర్వహించాలని సూచించారు. జీడిమామిడి తోటల్లో నీరు నిల్వ ఉండే విధంగా ట్రెంచ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. కొన్ని పంచాయతీల్లో వీఆర్పీలు బాధ్యతగా పనిచేయడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని, అలాంటివారి పనితీరులో మార్పు రావాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండల వ్యాప్తంగా చేపట్టిన అభివృద్ధి పనులు, ఇతర అంశాలపై చర్చించారు.ఉపాధి హామీ పథకం ఏపీవో చిన్నరావు, టీసీ దేముడు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ సాగుతో అధిక లాభాలు

బుచ్చెయ్యపేట : సేంద్రియ పద్ధతిలో వరి సాగు చేస్తే అధిక లాభాలు పొందవచ్చని, పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయని చోడవరం ఏడీఈ రవీంద్రనాథ్ తెలిపారు. బంగారుమెట్టలో బుధవారం నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి భాస్కరరావు మాట్లాడుతూ పచ్చిరొట్ట, సేంద్రియ ఎరువుల వినియోగం వల్ల ఆరోగ్యకరమైన పంట పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు సాయం రఘు,దొండా శ్రీను,మేరుగు బాబూరావు,జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో పయనించాలి



మాట్లాడుతున్న ప్రవచనకర్త గోపాలకృష్ణ ఆచార్యులు

నర్సీపట్నం: మానవతా విలువల పరిరక్షణకు యువత సన్మార్గంలో పయనించాలని ప్రవచనకర్త ఇంద్రకంటి వెంకట గోపాలకృష్ణ ఆచార్యులు తెలిపారు. స్థానిక ఎన్జీహోమ్‌లో శివోహం టీం ఆధ్వర్యంలో బుధవారం సనాతన ధర్మ పరిరక్షణ వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ సనాతన ధర్మ పరిరక్షణకు ఇటువంటి కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలన్నారు. నానాటి దిగజారుతున్న మానవతా విలువలను పరిక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. యువతరం మంచి నడవడిక, సామాజిక స్పృహ కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.

నామరూపాల్లేకుండా..



దేవరాపల్లిలో ఇంటింటా కుళాయి పైపులైన్ కోసం తవ్విన రోడ్డు



సిమెంట్ రోడ్డు పెచ్చులతో పూడిక పోయిన డ్రైనేజీ

- రూ.కోట్ల రహదారులు ఛిన్నాభిన్నం
- రాకపోకలకు అవస్థలు

దేవరాపల్లి: మేజర్ పంచాయతీ దేవరాపల్లిలో చేపడుతున్న ఇంటింటి కుళాయి పైపులైన్ పనులతో వీధుల్లో సీసీరోడ్లన్నీ ధ్వంసమయ్యాయి. కోట్లాది రూపాయలతో పక్కా నాణ్యతా ప్రమాణాలతో నిర్మించిన సీసీ రోడ్లు ఏడాది పూర్తి కాకముందే నామరూపాలు లేకుండా మారిపోయాయి. జల్‌జీవన్ మిషన్ పథకంలో ఇంటింటి కుళాయిల కోసం గొయ్యిలు తవ్వడంతో రోడ్ల కళావిహీనంగా దర్శనమిస్తున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సదరు పనులు చేపట్టే వ్యక్తులు ఇష్టానుసారం తవ్వకాలు జరుపుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. తొందరగా పనులు పూర్తికావడమే ధ్యేయంగా మిషన్లతో అవసరానికి మించి తవ్వకాలు చేపట్టడంతో రోడ్లు దెబ్బతింటున్నాయని వారు తెలిపారు. పనులు పూర్తయిన తర్వాత పైపులైన్లు వేసి పూడ్చే పనులు చేపట్టడంలో జాప్యం చేస్తుండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకు ఇరువైపుల గోతులు తవ్వి, సిమెంట్ కాంక్రీట్ ముక్కలను అక్కడే వదిలేయడంతో అవస్థలకు గురవుతున్నారు. ఇంటి నుంచి కాలు బయటకు పెట్టే పరిస్థితి లేక వృద్ధులు, చిన్న పిల్లలు నరకయాతన పడుతున్నారు. కొన్ని చోట్ల సిమెంట్ డ్రైనేజీలు సైతం దెబ్బతిని పూడుకుపోయాయి. ఇప్పటికైనా సదరు అధికార్లు స్పందించి ఈ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. ఇదే విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చంద్రశేఖర్ వద్ద ప్రస్తావించగా సిమెంట్ రోడ్డు కట్ చేసి పెచ్చులను అక్కడే వదిలేయడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తనకు స్థానికులు ఫిర్యాదు చేశారని చెప్పారు. ఇదే విషయాన్ని సదరు కంట్రాక్టర్‌కు చెప్పి సిమెంట్ రోడ్డు పెచ్చులను ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించానన్నారు. ఇకపై ఇలాంటి ఇబ్బందులు పునరావృతం కాకుండా ప్రత్యేక దృష్టి సారిస్తానని ఆయన తెలిపారు.

మత్తుకు బానిసైతే జీవితం చిత్తు

ప్రధాన సివిల్ జడ్జి రాజేంద్రబాబు



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సివిల్ జడ్జి రాజేంద్రబాబు

చోడవరం రూరల్: విద్యార్థి దశలో మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాల గురించి అవగాహన ఏర్పర్చుకుంటే భవిష్యత్ బాగుంటుందని, వాటికి బానిసలైతే జీవితం చిత్తు కాగితమే అవుతుందని ప్రధాన సివిల్ జడ్జి ఈ. రాజేంద్ర బాబు అన్నారు. పట్టణ సమీపంలోని గాంధీగ్రామం పంచాయతీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలు, ట్రాఫిక్ నియయనిబంధనల గురించి అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రిన్సిపల్ సివిల్ జడ్జి రాజేంద్రబాబు మాట్లాడుతూ 'సే నో టు డ్రగ్స్' ను తాము పాటించడమే గాకుండా పరిసర ప్రజలకు తెలియపరిచే బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. ఎస్‌ఐ శేఖరం మాట్లాడుతూ విద్యార్థి దశలో ట్రాఫిక్ నియమ నిబంధనలు తెలుసుకోవాలని, మేజర్లు కాకమునుపే వాహనాలు నడిపే దుస్సాహసాలు చేయడం ప్రమాదకమన్నారు. న్యాయవాది ఆర్. ఎస్.పి.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి కుళాయిల పరిశీలన



తంగుడుబిల్లిలో కుళాయిని పరిశీలిస్తున్న బృందం సభ్యులు

చీడికాడ: మండలంలోని పలు గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా ఏర్పాటు చేసిన ఇంటింటి కుళాయిల పనితీరును మంగళవారం అధికారుల బృందం పరిశీలించింది. వింటిపాలెం, బి.సింగవరం, తంగుడుబిల్లి గ్రామాల్లో 12 ఇళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు,ప్రభుత్వ సంస్థలు,పాఠశాలల వద్ద గల కుళాయిలు పరిశీలించారు. ఈ బృందంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీకాంత్, జేజేఎం డీపీఎంయూ జిల్లా కో–ఆర్డినేటర్ పి.పుల్లయ్య ఉన్నారు.

తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం



జోగుంపేటలో తల్లిపాల విశిష్టతను వివరిస్తున్న దృశ్యం



రోలుగుంటలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న వైద్యాధికారి ధనలక్ష్మి



చీడిగుమ్మలో గర్భిణులకు సామూహిక సీమంతం



కె.కోటపాడులో అవగాహన ర్యాలీలో పాల్గొన్న సీడీపీవో మంగతాయారు



కేజే పురంలో మాట్లాడుతున్న ఎంపీటీసీ సభ్యులు భీశెట్టి శ్రీనివాసరావు



యం.బెన్నవరంలో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

గొలుగొండ: తల్లిపాలతోనే బిడ్డను సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని పుట్టిన బిడ్డను తప్పనిసరిగా తల్లిపాలు ఇవ్వాలని గొలుగొండ ఐసీడీఎస్ సీడీపీవో శ్రీగౌరి, గొలుగొండ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రసాద్ తెలిపారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా చీడిగుమ్మల–2. జోగుంపేటలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చీడిగుమ్మలలో చిన్నారులకు అన్నప్రాసన, గర్భిణులకు సీమంతాలు నిర్వహించగా, జోగుంపేటలో ర్యాలీ నిర్వహించి తల్లిపాల గొప్పతనాన్ని తల్లులకు తెలియజేశారు. ప్రతి గ్రామంలో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు పీవో శ్రీగౌరి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రసాద్ తెలిపారు.

మాడుగుల రూరల్: తల్లిపాలే బిడ్డకు సంపూర్ణ ఆహారమని కేజేపురం ఎంపీటీసీ సభ్యులు భీశెట్టి శ్రీనివాసరావు అన్నారు. తల్లి పాలు వారోత్సవాలు పురస్కరించుకుని కేజే పురం 3వ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తల్లి పాలు బిడ్డకు మొదటి టీకా అని, పుట్టిన నాటి నుంచి ఆరు నెలల వరకు తల్లి పాలు ఇవ్వాలన్నారు. ఐసీడీఎస్ పర్యవేక్షురాలు జి.వి.రమణి మాట్లాడుతూ తల్లి పాలు బిడ్డకు ఇవ్వడం వల్ల వ్యాధులు దరి చేరవన్నారు.

కె.కోటపాడు : పుట్టిన వెంటనే బిడ్డకు తల్లిపాలను అందించడం వల్ల పలు ప్రయోజనాలున్నాయని కె.కోటపాడు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారిణి మంగతాయారు అన్నారు. కె.కోటపాడులో బుధవారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ తల్లిపాల విశిష్టతను వివరించారు. తల్లిపాలలో అధిక ఔషధ గుణాలు ఉండడం వల్ల బిడ్డకు వచ్చే వ్యాధులను ఎదుర్కొనేందుకు అవసరమయ్యే శక్తి సమకూరుతుందని చెప్పారు. అనంతరం అవగాహనా ర్యాలీని అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

నాతవరం: బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం వల్ల కలిగే లాభాలపై తల్లులు అవగాహన కలిగి ఉండాలని గొలుగొండ ఐసీడీఎస్ సీడీపీవో శ్రీగౌరీ అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బుధవారం యం.బెన్నవరం, చమ్మచింత గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డకు ఆరు నెలల వరకు తల్లిపాలు ఇవ్వడం ఎంతో శ్రేయస్కరమన్నారు. ఈకార్యక్రమంలో సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, నాగజ్యోతి, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రోలుగుంట: డబ్బాపాలు వద్దు.. తల్లిపాలే ముద్దు, బిడ్డకు తల్లిపాలే శ్రేష్టమని రోలుగుంట పీహెచ్‌సీ వైద్యురాలు కె.ధనలక్ష్మి అన్నారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా ఐసీడీఎస్ రోలుగుంట, బుచ్చింపేట సెక్టార్ల సూపర్‌వైజర్లు రమ్య,హేమ వారి పరిధిలో అంగన్‌వాడీ టీచర్లతో బుధవారం ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రోలుగుంటలో జరిగిన కార్యక్రమంలో ధనలక్ష్మి మాట్లాడుతూ తల్లిపాలు తాగించడం వల్ల బిడ్డకు కలిగే మేలు గురించి వివరించారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

మాడుగుల: మండలంలోని ఘాట్‌రోడ్ జంక్షన్‌లో వెలసిన మోదకొండమ్మ పాదాల వద్ద శ్రావణ మాసం సందర్భంగా బుధవారం గౌరీమాతకు భక్తి శ్రద్ధలతో కుంకుమపూజలు నిర్వహించారు. అనంతరం నక్షత్ర హారతి, పంచ హారతి ఇచ్చారు. వర్తక సంఘం సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాలు పెంచాలి



విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకుంటున్న రవి

మాకవరపాలెం: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని భీమిలి డైట్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ గొర్డేటి రవి సూచించారు. తామరం–2 ప్రాథమిక పాఠశాలను ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా హాజరు, ఇతర రిజిస్టర్లను తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను తెలుసుకున్నారు. విద్యార్థులు తెలుగు, ఆంగ్లం చదవడం, గణిత ప్రక్రియలను చేయడంలో సామర్థ్యం కనబరచడాన్ని ప్రశంసించారు. అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

ఘనంగా చేనేత దినోత్సవం



తూటిపాలలో చేనేత వస్త్రాలతో హాజరైన విద్యార్థులు, ఉపాధ్యాయుడు



బయ్యవరంలో నేత కార్మికులను సత్కరిస్తున్న ఎంఈవో మూర్తి

మాకవరపాలెం: మండలంలో చేనేత దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు చేనేత దుస్తులు ధరించి పాఠశాలకు హాజరయ్యారు. బయ్యవరంలో చేనేత కార్మికులను విద్యార్థులతో కలసి ఎంఈవో పి.ఎస్.ఎన్.మూర్తి ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చేనేత కార్మికుల ను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం చేనేత దినోత్సవాన్ని నిర్వహిస్తోందన్నారు. చేనేత దుస్తుల ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. బయ్యవరం సర్పంచ్ లాలం కాశీవిశ్వనాథ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం వైఎస్సార్ నేతన్న నేస్తం పేరుతో ఏటా రూ.25 వేలు అందజేసిందని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా చేనేత కార్మికులను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బయ్యవరం మాజీ సర్పంచ్ లాలం రమణ, గిడుతూరు సచివాలయ సిబ్బంది, తూటిపాల హెచ్‌ఎం కె.రాము, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
7997958337, 7075709854, 7997958336

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నర్సీపట్నం డివిజన్:
నర్సీపట్నం : 9010234557
చోడవరం : 9010210265
మాడుగుల : 9010546644
Office mail : sakshiadvtvsp@gmail.com